
సాక్షి కర్నూలు

గురువారం । 3 । జూలై । 2025



విష సర్పాలతో జాగ్రత్త !
వర్షాలు కురుస్తున్నందున భూమి పొరల్లో నుంచి విష సర్పాలు బయటకు వస్తున్నాయి. పాముకాట్లకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా నెల రోజుల్లో ఇద్దరు మృతి చెందారు. 8లో▸



ప్రాణాల మీదకు తెచ్చిన మద్యం
భర్త మద్యం అలవాటు ప్రాణాల మీదకు తెచ్చింది. గోనెగండ్లలోని కురువ పేటకు చెందిన భార్య ఉరుకుందమ్మ, భర్త ఈరన్న పురుగు మందు తాగి స్పృహ కోల్పోయారు. 8లో▸



సుంకేసులకు దిక్కెవరు!
కేసీ కెనాల్‌కు నీటిని మళ్లించేందుకు తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీ ఎంతో కీలకమైంది. అలాంటి బ్యారేజీ నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. 8లో▸

న్యూస్‌రీల్

తగ్గింపు ధరలకు మద్యమంటే నమ్మొద్దు

కర్నూలు: వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యాన్ని తగ్గింపు ధరకు సరఫరా చేస్తామని చెప్పేవారి మాటలు నమ్మొద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి(ఈఎస్) ఎం.సుధీర్ బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. లైసెన్స్ లేని వ్యక్తుల(అనధికార వ్యక్తులు) వద్ద మద్యం కొనుగోలు చేయడం చాలా ప్రమాదకరమని, అలాంటి మద్యం నకిలీది కూడా కావచ్చన్నారు. అనధికార వ్యక్తులు సరఫరా చేసే నకిలీ మద్యం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం హానిని కలిగించవచ్చని, కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారి తీస్తుందన్నారు. అలాంటి అనుమానిత వ్యక్తుల వివరాలను టోల్‌ఫ్రీ నెంబర్ 14405కు కానీ, 94409 02572 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

ఢిల్లీకి వెళ్లిన జిల్లా కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఢిల్లీకి వెళ్లారు. రెండో విడత ఓటరు జాబితా నిర్వహణ, కొత్తగా వచ్చిన ఎన్నికల చట్టాలపై న్యూఢిల్లీలోని ట్రిపుల్‌ఐటీ డీఎంలో జూలై 3, 4 తేదీల్లో నిర్వహించే శిక్షణ తరగతులకు జిల్లా కలెక్టర్ హాజరుకానున్నారు. శిక్షణకు ఆలూరు ఈఆర్ఓ టి.అజయ్‌కుమార్, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో బీఎల్ఓ కూడా వెళ్లారు.

ఖరీఫ్‌లో 135 రైతు శిక్షణా కార్యక్రమాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వివిధ పంటల సాగులో 135 శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని రైతు శిక్షణా కేంద్రాల ద్వారా శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కర్నూలు జిల్లాలో 66, నంద్యాల జిల్లాలో 69 రైతు శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అన్ని ప్రధాన పంటల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో శిక్షణ కార్యక్రమానికి ఆత్మ ద్వారా రూ.6వేలు ఖర్చు చేస్తామని తెలిపారు.

రూ.1.13 కోట్లతో ఫాంపాండ్స్, చెక్‌డ్యాంలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన-2 కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.1.13 కోట్లతో ఫాంపాండ్స్, చెక్ డ్యాంలు నిర్మిస్తున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత తెలిపారు. కర్నూలు జిల్లాలో ఐదు ప్రాజెక్టులు ఉండగా రూ.70.75 కోట్లతో పనులు నిర్వహిస్తున్నామన్నారు. నంద్యాల జిల్లా రెండు ప్రాజెక్టులు ఉండగా ఎద్దుపెంట ప్రాజెక్టులో రూ.15 లక్షలు, ఆకుమల్ల ప్రాజెక్టులో రూ.28 లక్షలతో పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎస్ఆర్ఎం కింద ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రైవేట్ స్కూళ్ల బంద్

కర్నూలు సిటీ: విద్యాశాఖలో పని చేస్తున్న కొందరు అధికారుల వైఖరి, వేధింపులతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలలు నేడు(గురువారం)బంద్ పాటించనున్నట్లు ఏపీ ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు స్కూళ్ల విషయంలో విద్యాశాఖ అధికారులు కొంత మంది అతిగా స్పందించడం, కమిటీలు, తనిఖీల పేరుతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు స్కూళ్లలో ఆర్‌టీఈ 12(1)సీ అడ్మిషన్ల విషయంలో బలవంతం చేయడం, షోకాజ్ నోటీసులు, స్కూల్ గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడంతో బంద్ పాటించనున్నట్లు తెలిపారు.

అనాథ పిల్లలకు 'ఆధార్'



ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (సెంట్రల్): ఉమ్మడి జిల్లాలో సాధి కమిటీ గుర్తించిన 125 మంది దిక్కులేని/అనాథ పిల్లలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆధార్ కార్డులు ఇప్పిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి వెల్లడించారు. బుధవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో సాధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు ఇప్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరికైనా దిక్కులేని పిల్లలు కనిపిస్తే 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలని సూచించారు. నంద్యాల ఐసీడీఎస్ పీడీ స్వప్న, కర్నూలు డీసీపీఓ శారద, కర్నూలు అర్బన్ తహసీల్దార్ రవిచంద్ర పాల్గొన్నారు.

మొలకలు మేసి.. ఆశలు తొక్కేసి!

- జింకలతో పైర్లు నాశనం
- రాత్రిళ్లు కంటికి కునుకు లేకుండా కాపలా కాస్తున్న రైతులు
- ఏర్పాటు కాని జింకల పార్కు
- హామీని మరచిన సీఎం చంద్రబాబు



ఆలూరు మండలం కురుకుంద గ్రామ సమీప పత్తి పంట పొలాల్లో సంచరిస్తున్న జింకలు



ఆలూరు /రూరల్: పంట పొలాలను జింకలు నాశనం చేస్తున్నాయి. రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో రైతులు 80 వేల హెక్టార్లలో పప్పుశనగ, జొన్న తదితర పంటలను సాగు చేశారు. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, మద్దికెర, పత్తికొండ, తుగ్గలి మండలాల్లో జింకల బెడద అత్యధికంగా ఉంది.

పొలాల వద్ద కాపలా

వేల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు చాలా ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఒక వైపు అరకొర వర్షాలు.. మరో వైపు జింకల బెడద అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. జింకలు వేల సంఖ్యలో పొలాల మీదపడి మొక్క దశలోని పైరును తినేస్తున్నాయి. దీంతో పైర్లను కాపాడుకునేందుకు రైతన్నలు రాత్రింబవళ్లు పొలాల వద్ద కాపలా కాయాల్సి వస్తోంది.

ఆపరేషన్ బ్లాక్‌బక్‌తో జింకల పట్టివేత

రైతుల వినతి మేరకు 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్పందించారు. ఆపరేషన్ బ్లాక్‌బక్ పేరుతో జింకలు పట్టేందుకు రూ.2 కోట్ల నిధులు విడుదల చేశారు. స్థానికంగా ఉన్న కూలీలు, రైతుల ద్వారా జింకలు పట్టే కార్యక్రమం చేపట్టారు. ఒక్క జింక పట్టుకున్న వారికి రూ.500 వరకు అందించారు. వాటిని బోనుల్లో బంధించారు. పట్టిన జింకలను అటవీశాఖ అధికారులు నల్లమల ఫారెస్టు ప్రాంతంలో వదిలేశారు. ఈ కార్యక్రమం ఏడాది పాటు దిగ్విజయంగా సాగింది. దీంతో పంటలు సాగు చేసిన రైతులకు కొంత మేర ఊరట లభించింది. కొన్ని రోజుల తర్వాత జింకలు పట్టేందుకు కూలీలు ముందుకు రాకపోవడంతో ఆ కార్యక్రమం ముందుకు సాగలేదు.

అన్నదాత సుఖీభవ అన్న పాలకులు.. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా స్పందించడం లేదు. జింకల బెడదను తొలగిస్తాం అంటూ 2014, 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి మరచిపోయారు. కష్టజీవులు కంటికి కునుకు లేకుండా రాత్రి సమయంలో పొలాల వద్ద పైర్లను కాపాడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. చెంగుచెంగున ఎగిరి వచ్చే జింకలను తరుముతుండటంతో కర్షకులపై కేసులు పెట్టి హింసిస్తున్నారు. 'ఇదేం పాలన బాబు.. పంటలు పండుతాయా.. అందరికీ అన్నం దొరుకుతుందా' అనే ప్రశ్నలు రైతుల నోట వస్తున్నాయి.



పత్తి పొలంలో జింకలు రాకుండా కాపలా కాస్తున్న కురుకుంద గ్రామ రైతు

30వేల జింకలు

గత ఏడాది ఖరీఫ్‌లో పంటలపై జింకలు దాడి చేసి రైతులకు తీవ్రంగా నష్టం జరిగింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. జింకల బెడద నుంచి పంటలను కాపాడేందుకు హొళగుంద మండలం దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చినా హామీ నెరవేర్చలేకపోయారు. ఇదిలా ఉండగా... దేవరగట్టు కొండల్లో సంచరిస్తున్న జింకలకు పచ్చిగడ్డి, తాగునీరు కరువై ఆస్పరి, హొళగుంద, ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి, దేవనకొండ మండలాల్లో వేల సంఖ్యలో సంచరిస్తున్నాయి. హొళగుంద మండలం హెబ్బటం, పెద్దగోనేహళ్, ఇంగళదహళ్, ఎల్లార్తి, చిన్నహ్యాట, పెద్దహ్యాట, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట, సుళువాయి, లింగంపల్లి తదితర గ్రామాల పరిధిలో వీటి సంచారం ఎక్కువగా ఉంది. ఆలూరు, పత్తికొండ ఫారెస్ట్ పరిధిలో దాదాపు 30 వేల వరకు జింకలు ఉన్నట్లు తెలుస్తోంది.

బాబు.. జింకల పార్కు ఏదీ?

జింకల పార్కు ఏర్పాటు చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక జింకల పార్కు ఏర్పాటు ప్రతిపాదనగా మిగిలిపోయింది. రైతులు ఎన్ని సార్లు అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మరో సారి ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఆలూరుకు వచ్చిన చంద్రబాబు.. ఈ సారి కచ్చితంగా జింకల పార్కు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట తప్పారు. హామీని అమలు చేయాలని, జింకల బారి నుంచి పంట పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పంటను నాశనం చేశాయి



నేను ఎనిమిది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. పంట సాగుకు రూ.75 వేలు ఖర్చు అయ్యింది. వందల సంఖ్యలో జింకలు సంచరిస్తూ నాలుగు ఎకరాల్లో పంటను నాశనం చేశాయి. పగలురాత్రి కంటికి కునుకు లేకుండా పొలాల్లో కావలి ఉండాల్సి వస్తోంది.

– శ్రీరాములు, రైతు, కురుకుంద గ్రామం, ఆలూరు మండలం

హామీని అమలు చేయాలి



పంట పొలాలను జింకలు నాశనం చేస్తున్నాయి. ఆలూరు ప్రాంతంలో ఎక్కువగా పత్తి పంట సాగు చేస్తారు. పంట సాగు మొక్క దశ నుంచి దిగుబడి వచ్చే వరకు పొలాల్లో కాపలా ఉండాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన జింకల పార్కు హామీని నెరవేర్చాలి.

– వెంకటేష్, అరికెర, ఆలూరు మండలం

కేసులు నమోదు చేయడం దారుణం



ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను జింకలు నాశనం చేస్తున్నాయి. పెట్టుబడి కింద వేల రూపాయలు ఖర్చు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జింకల బెడద నుంచి పంటలను కాపాడేందుకు రాత్రి సమయంలో పొలాల వద్ద ఉండాల్సి వస్తోంది. అటవీశాఖ అధికారులు మాత్రం వైల్డ్ లైఫ్ యాక్టు 51 చట్టం ప్రకారంగా రైతుల మీద కేసులు నమోదు చేయడం దారుణం. వెంటనే జింకల పార్కును ఏర్పాటు చేయాలి.

– మునిస్వామి, సీపీఐ (ఎంఎల్) నాయకుడు

ధర్నా చేస్తాం



పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చే వారే లేరు. మొలకెత్తిన పత్తిని జింకలు తినేస్తున్నాయి. వాటిని నుంచి పైర్లను రక్షించేందుకు ఒక మనిషి ప్రత్యేకంగా పొలంలోనే ఉండాల్సి వస్తోంది. బాధతో జింకలను కొడితే కేసులు పెడుతున్నారు. కొర్ర, సజ్జ పైర్లు నాశనం అవుతున్నాయి. జింకల పార్కును ఏర్పాటు చేయకుంటే ఫారెస్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం.

– ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తూ రైతులు అన్న మాటలు

సమస్యలు తీర్చండయ్యా!



ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని సమస్యలపై నిలదీస్తున్న తిప్పమ్మ

నందవరం: మండలంలోని మిట్టసోమపురం గ్రామంలో ఎమ్మెల్యే బి.వి.జయనాగేశ్వరరెడ్డికి అడుగడుగునా సమస్యల స్వాగతం లభించింది. బుధవారం ఆయన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. గ్రామంలో వీధి వీధినా తల్లికి వందనం రాలేదని, కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని, తెలుగు గేరిలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, తాగు నీటి కుళాయిలు కూడా లేవని సమస్యలు తీర్చండయ్యా అంటూ మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. తిప్పమ్మ అనే మహిళ మాట్లాడుతూ మా వీధిలో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని, మురుగు నీటిలోనే నడవాల్సి వస్తోందన్నారు. రాత్రి పూట బయటకు వెళ్లాలంటే నరకం కనిపిస్తోందని.. తెలుగు గేరిలో డ్రైయినేజీలు లేక మురుగు నీరు రోడ్లపైనే పారుతోందని వాపోయారు. తన భర్తకు 60 యేండ్లు దాటినా పింఛన్ రాలేదు, నీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యేతో ఏకరువు పెట్టింది.

రక్షిత నీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న డీపీఓ జి.భాస్కర్

కర్నూలు(అర్బన్): ప్రస్తుత వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో నీరు కలుషితం కాకుండా రక్షిత నీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 54 నీటి ట్యాంకులకు మెట్లు లేవని, పలు ట్యాంకులకు సంబంధించిన మెట్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన 15 రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. నీటిని క్లోరినేషన్ చేసేందుకు ప్రస్తుతం మిషన్ల ద్వారా టాబ్లెట్లు అందుబాటులో ఉన్నాయని, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల సహకారంతో టాబ్లెట్లు వినియోగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నట్లు చెబుతున్నా, ఐవీఆర్ఎస్‌కు కాల్స్ వెళ్తున్నాయన్నారు. స్వర్ణ పంచాయత్‌లో భాగంగా ఆధార్ సీడింగ్‌ను వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఇళ్ల విస్తీర్ణానికి సంబంధించిన తేడాలను వెంటనే గుర్తించి పన్నుల్లో వ్యత్యాసాన్ని సరిదిద్దితే గ్రామ పంచాయతీలకు ఆదాయం పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు.

గిరిజన స్కాలర్‌షిప్‌లలో ఎన్ఎస్‌పీ, ఓటీఆర్‌కు ప్రాధాన్యం

కర్నూలు(అర్బన్): గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలకు సంబంధించి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ), వన్ టైం రిజిస్ట్రేషన్(ఓటీఆర్)కు అధిక ప్రాధాన్యత ఉందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.కొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తులకు ఓటీఆర్ చాలా ముఖ్యమన్నారు. అలాగే చెల్లుబాటయ్యే ఓటీఆర్ నెంబర్ లేకుండా ఎస్టీ విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో తమ ఉపకార వేతనాల దరఖాస్తులను పూరించలేరని, అలాగే ఉపకార వేతనాల ప్రాసెసింగ్, జాప్యానికి దారి తీస్తుందన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు త్వరగా వారి ఎన్ఎస్‌పీ, ఓటీఆర్‌లను జనరేట్ చేయడంలో ఎస్టీ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. సందేహాలుంటే 9505191761, 9989120904 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాలపై 1930కి ఫిర్యాదు చేయండి



సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

కర్నూలు: సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'నేను సైబర్ స్మార్ట్' కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ క్రైం జరిగిన గంట లోపే హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫిర్యాదు చేస్తే తప్పక న్యాయం జరుగుతుందన్నారు. సైబర్ క్రైం పోర్టల్ cybercrime.gov.inలో బాధితులు వివరాలు నమోదు చేయాలని అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించి సైబర్ నేరం జరిగిన వివరాలు కూడా తెలియజేయాలన్నారు. 38 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు 2,460 'నేను సైబర్ స్మార్ట్' అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు 22 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 7.3 మి.మీ వర్షం కురిసింది. కాగా బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని దాదాపు అన్ని మండలాల్లో వానలు పడుతున్నాయి. ఆదోని మండలం గణేకల్‌లో 69.5, పెసలబండలో 61.5, కౌతాలం మండలం తోవిలో48.5, ఆళ్లగడ్డలో 39.7, ఎమ్మిగనూరు మండలం కందనాతిలో 36.5, కోసిగిలో 32.2, డోన్‌లో 30, రుద్రవరంలో 29.2 మిమీ ప్రకారం వర్షాలు కురిశాయి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో చలి తీవ్రత పెరిగింది. రుతుపవనాల ప్రభావం వల్ల వానలు పడుతున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో కూడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఉడకని అన్నం .. చెడిపోయిన గుడ్లు

- ఇదేమి మధ్యాహ్న భోజనం: మున్సిపల్ చైర్‌పర్సన్



భోజనాన్ని చూపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆదోని సెంట్రల్: మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు విద్యార్థులకు ఉడకని అన్నం, చెడిపోయిన గుడ్లను పెట్టడం ఏమిటని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదోని పట్టణంలోని కిలిచినపేట పురపాలక ఉన్నత పాఠశాలలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం పథకంలో ఉడికీ ఉడకని అన్నంను వడ్డించడంతో చాలామంది తినలేక పారవేస్తున్నారన్నారు. పిల్లలకు ఇచ్చే గుడ్లు కూడా చెడిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డించాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

'అన్నదాత సుఖీభవ' ఇప్పట్లో లేనట్లే!

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాత సుఖీభవ కింద కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. జూన్ నెల మొదటి వారం నుంచి ఇదిగో అదిగో అంటూ రైతులను ఊరిస్తూ ఉసూరుమనిపిస్తోంది. 2024-25 సంవత్సరంలో ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం.. 2025-26లో ఖరీఫ్ సీజన్‌లోనే అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. మొదట్లో జూన్ 12న ఇస్తామని.. ఆ తర్వాత 20, 21, 22 తేదీల్లో విడుదల చేస్తామని కూటమి పార్టీల నేతలు ప్రకటిస్తూ వచ్చారు. అయితే రోజు, వారాలు, నెలలు గడచిపోతున్నా ప్రభుత్వం ఆ దిశగా ఆలోచిస్తున్న దాఖలాల్లేవు. తాజాగా అక్టోబర్ నెలలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారనే ప్రచారం జరుగుతోంది. 2024 మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్-6లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు చెల్లిస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయితే ఖరీఫ్ సీజన్ మొదలై నెల రోజులు గడిచినా ఆ ఊసే లేకపోవడం గమనార్హం.

స్టాంపుల కొరత.. క్రయవిక్రయాలకు అవస్థ

- అందుబాటులో లేని నాన్ జ్యుడీషియల్, రెవెన్యూ, బ్యాంకు, కోర్టు స్టాంపులు
- ఈ-స్టాంపులను రేటు పెంచి అమ్ముతున్న వెండర్లు
- మూడు నెలలుగా స్టాంపుల విక్రయ కౌంటర్ మూసివేత
- పట్టించుకోని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు



మూతపడిన స్టాంపుల విక్రయ కౌంటర్

కర్నూలు(సెంట్రల్: జిల్లాలో స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదే క్రమంలో ఈ-స్టాంపులకు డిమాండ్ ఉండడంతో వెండర్లు వాటిని మూడు, నాలుగు రెట్లు పెంచి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అయినా రిజిస్ట్రేషన్ శాఖాధికారులు తమకేమి సంబంధంలేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలకు వస్తున్నాయి.

అధిక ధరలకు విక్రయం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో రిజిస్ట్రేషన్లకు వినియోగించే నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులోలేవు. ఇందుకు ప్రధాన కారణం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో కావాల్సిననన్నీ అందుబాటులో ఉంచకపోవడమే. దీంతో పూర్తిగా ఈస్టాంపులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో వెండర్లు రేట్లు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. రూ.10 స్టాంపును రూ.40లకు, రూ.20 స్టాంపును రూ.50 లకు, రూ.50 స్టాంపును రూ.100, స్టాంపు రూ.160 వరకు అధికంగా అమ్ముకుంటున్నారు. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఎవరైనా ఎక్కువ రేట్లకు ఎందుకు అమ్ముతున్నారంటే వారికి స్టాంపులు ఇవ్వడంలేదు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తే జిల్లా రిజిస్ట్రార్ అందుబాటులో ఉండడంలేదు. ప్రస్తుతం రెగ్యులర్ జిల్లా రిజిస్ట్రార్ లేకపోవడంతో నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ జానకిదేవి విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల విక్రయించే బుకింగ్ పాయింట్ నాలుగైదు నెలల నుంచి మూత పడింది. ఇటీవల అక్కడ పనిచేస్తున్న ఉద్యోగిని ఏసీబీ అక్రమ కేసులో ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉన్నా ఎవరినీ నియమించకపోవడంతో ఏకంగా స్టాంపుల విక్రయ స్టాల్‌నే మూసివేశారు.

మూతపడిన స్టాంపుల కౌంటర్

జిల్లాలో అన్ని రకాల స్టాంపుల కొరత నెలకొంది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అస్సలు అందుబాటులో లేకపోవడంతో ఈస్టాంపులతో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నారు. అయితే బ్యాంకులు వినియోగించే ఫ్రాంక్లిన్ స్టాంపులు, రెవెన్యూ, కోర్టు, స్పెషల్ అడెసివ్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. ఇందులో రెవెన్యూ స్టాంపులు పోస్టాఫీసుల్లో కూడా అందుబాటులో ఉంటాయి. మిగిలిన అన్ని రకాల స్టాంపులను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయమే ప్రజలకు అందుబాటులో ఉంచాల్సి ఉంది. అయితే వారు పట్టించుకోకపోవడంతో ఉన్న వాటిని వెండర్లు అధిక ధరలకు అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. ఈ స్టాంపుల విక్రయాలకు సంబంధించిన కౌంటర్‌ను మూసి వేశారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా అడిగితే మాత్రం తమ దృష్టి రాలేదని, పరిశీలన చేసి విక్రయదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని అధికారులు చెప్పడం విశేషం.

కృత్రిమ కొరత

కర్నూలు, నంద్యాల, అనంతపురం, ప్రకాశం జిల్లాల(మార్కాపురం నియోజకవర్గం) కు సంబంధించిన ఈ-స్టాంపింగ్ స్టాక్ హోల్డర్ ఈస్టాంపులను సక్రమంగా సరఫరా చేయకుండా అప్పుడప్పుడు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. క్రయ, విక్రయాదారులకు అవసరమైన ఈ-స్టాంపులను గుర్తింపు పొందిన వెండర్లకు సరఫరా చేయాల్సి ఉన్నా చేయడంలేదు. ఇందుకు ఆయన వెండర్లకు ఓ షరతు పెడుతున్నారు. తన ఖాతాలో రిజిస్ట్రేషన్లకు వినియోగించే చలాన్లను వినియోగదారుల ద్వారా చెల్లించేలా చేస్తేనే ఈ స్టాంపులను ఇస్తానని చెబుతున్నట్లు వెండర్లు వాపోతున్నారు. ఫలితంగా ఆయన సమయానికి ఈస్టాంపులను ఇవ్వకపోవడంతో అనుకోకుండా కొన్ని సార్లు కొరత నెలకొంటోంది. ఆ సమయంలో స్టాంపులు ఉన్న వెండర్లు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు

కర్నూలు: కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కురువ శేషన్న (62)ను హత్య చేసిన దుండగులను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శేషన్న లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన ఇంటి వెనుక ఉన్న అదే సామాజిక వర్గానికి చెందిన తెల్లన్న కుమారులు గోవిందప్ప అలియాస్ చౌదరి, బీసన్న, కుమార్, పరుశురాముడు కలిసి మంగళవారం రాత్రి శేషన్న ఇంట్లోకి దూరి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు గ్రామానికి చేరుకుని ఉద్రిక్త పరిస్థితిని అదుపు చేశారు. నిందితుల్లో ఒకరు శేషన్న కాలును నరికి తీసుకెళ్లి పోలీసులకు లొంగిపోగా మిగతా ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరశురాముడు భార్యను కొంతకాలంగా శేషన్న వేధిస్తుండటం వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో నిందితులు అంగీకరించినట్లు సమాచారం. శేషన్న కూతురు శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనాథ పిల్లలకు వైద్యపరీక్షలు



డాక్టర్ మహేశ్వర ప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలోని అనాథ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ చెప్పారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. జిల్లాలోని పెద్దపాడులో 49 మంది, పత్తికొండలో 33 మంది, కర్నూలులోని స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీలో ముగ్గురు, చైల్డ్ హోమ్స్, చైల్డ్ ఇన్‌స్టిట్యూట్‌లలో 131 మంది అనాథ పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డైస్) వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తారన్నారు. అలాగే ఈ నెల 10న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,459 ప్రభుత్వ పాఠశాలలో 3,14,892 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ముందుగా హాస్టళ్లలో ఈ కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఈ ఏడాది చివరిలోపు తొలి విడత స్క్రీనింగ్ పూర్తి చేస్తామని చెప్పారు.

ఉద్యోగం పేరిట సైబర్ మోసం

గోనెగండ్ల: సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన కురువ వీరేష్ రూ.45 వేలు మోసపోయాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. హెచ్.కైరవాడికి చెందిన కురువ వీరేష్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో జూన్ 26న ఓ మొబైల్ యాప్‌లో ఉద్యోగ నోటిఫికేషన్ లింక్‌ను క్లిక్ చేశాడు. హీరో హోండా షోరూంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు అప్లికేషన్ కోసం రూ.3 వేలు పంపాలని చూపడంతో అక్కడ సూచించిన ఖాతాకు డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశాడు. మరుసటి రోజు ఉద్యోగం కావాలంటే కంపెనీ బాండ్ కోసం మరో రూ.3 వేలు చెల్లించాలని చూపడంతో నగదు పంపాడు. తర్వాత 28న బ్యాంకు ఖాతా ఓపెన్ చేసేందుకు రూ.5 వేలు పంపాలని, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింక్ చేసేందుకు మరో రూ.5 వేలు పంపాలని సూచించడంతో అలాగే చెల్లించాడు. తర్వాత మీరు ఇప్పటివరకు కట్టిన డబ్బు తిరిగి మీ అకౌంట్లో జమ కావాలంటే రూ.10 వేలు చెల్లించాలని సూచించడంతో నగదు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇలా 5 రోజుల్లో రూ.45 వేలు జమ చేశాడు. మళ్లీ సోమవారం అలాగే ఫోన్ రావడంతో తండ్రికి విషయం చెప్పాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించి గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారి సూచన మేరకు కర్నూలులోని సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

విష సర్పాలతో జాగ్రత్త!

- వర్షాలకు బయటకు వస్తున్న పాములు
- ఇప్పటికే పలువురికి పాముకాటు
- పొలాలు, పొదలు, తుప్పల్లో పొంచి ఉన్న విషనాగులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు





కాటేసిన పామును మెడలో వేసుకుని చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి (ఫైల్)

☛ బేతంచర్ల మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రంగమ్మ (46) గత నెల 2వ తేదీన వేరుశనగ పంట తొలగింపు పనులకు వెళ్లి పైరును తొలగిస్తుండగా చేతికి పాముకాటు వేసింది. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం బేతంచర్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

☛ ఆదోని పట్టణంలోని ఎరుకల కాలనికి చెందిన అభిరామ్ అనే బాలుడు రెండో తరగతి చదువుతున్నాడు. గత నెల 24వ తేదీన ఇంట్లో భోజనం చేస్తుండగా కాలు వద్ద ఏదో కుట్టినట్లు అనిపించి తల్లిదండ్రులకు చెప్పాడు. వెంటనే ఆదోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించగా పాము కాటేసిందని గుర్తించి వైద్యం అందిస్తుండగా కోలుకోలేక మృతి చెందాడు.

కర్నూలు(హాస్పిటల్): వర్షాలు కురుస్తున్నందున భూమి పొరల్లో నుంచి విష పురుగులు బయటకు వస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు ఇప్పటికే పాముకాట్లకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా నెల రోజుల్లో ఇద్దరు మరణించారు. పొదలు, తుప్పలు, రాళ్ల కుప్పల్లో పొంచి ఉన్న పాములను గుర్తించకుండా వెళ్లడంతో కాటువేస్తున్నాయి. వాటి కాటుకు గురైన వారు సమీపంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స కోసం వస్తున్నారు. అన్ని చోట్లా యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంటున్నాయి. సకాలంలో వచ్చిన వారికి ప్రథమ చికిత్స చేసి వీటిని వేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు పంపిస్తున్నారు. అయితే చాలా మంది పాముకాటుకు గురైన చాలా సేపటికి ఆసుపత్రికి వైద్యం కోసం వస్తుండటంతో ఆలస్యమై వారి ప్రాణాల మీదకు తెస్తోంది. పాము కాటు వేసిన వెంటనే ఆందోళనకు గురికావడం, ప్రథమ చికిత్సపై అవగాహన లేకపోవడం, ఆసుపత్రికి తరలించడంలో ఆలస్యం కావడం వంటి కారణాలతో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. త్రాచు పాము, కట్ల పాము వంటి 15 శాతం పాములే ప్రమాదకరమైనవి. అన్ని పాముకాట్లు ప్రమాదకరమైనవి కావని వైద్యులు చెబుతున్నారు.

పాము కరవగానే ఇలా చేయాలి

- ➤ పాము కరవగానే భయాందోళనకు గురి గాకుండా ధైర్యంగా ఉండాలి. బంధుమిత్రులు కూడా వారికి ధైర్యం చెప్పాలి.
- ➤ ఆ పాము విష సర్పమో కాదో గుర్తించే ప్రయత్నం చేయాలి. దానివల్ల చికిత్స మరింత కచ్చితంగా అందించవచ్చు.
- ➤ నాటు వైద్యం, మంత్రతంత్రాల జోలికి వెళ్లకుండా సాధ్యమైనంత తొందరగా దగ్గరలోని ఆసుపత్రికి రోగిని నడిపించకుండా తీసుకెళ్లాలి.



ఇలా చేయకూడదు

- ➡ పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతోపాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయడం వల్ల ఒక్కోసారి పాముకాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు. శాస్త్రీయమైన చికిత్స సాధ్యమైనంత త్వరగా అందించడమే ఉత్తమం.
- ➡ మరికొందరు పాము కరిచిన ప్రదేశంలో గాటుపెట్టి నోటితో విషం పీల్చేస్తుంటారు. పాముకాటు వేయగానే విషం రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు, గుండెకు చేరుకుంటుంది. కాబట్టి దీనివల్ల ప్రయోజనం ఉండదు. ఒక్కోసారి హాని కలగవచ్చు కూడా.
- ➡ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాముకాటుకు ఉచిత చికిత్స లభిస్తుంది. వైద్యునికి రోగి గురించి సమాచారాన్ని ముందే అందజేస్తే త్వరగా మెరుగైన చికిత్స అందజేసే వీలుంది.

“ ఎలాంటి పామో తెలుసుకుని చికిత్స



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ (ఎమర్జెన్సీ మెడిసిన్) విభాగానికి ప్రతి నెలా 22 నుంచి 25 మంది పాముకాటుతో చికిత్స కోసం వస్తుంటారు. కొందరు మెడలో పాములు వేసుకుని వస్తే మరికొందరు బతికున్న పామును, చంపిన పాములతో వస్తుంటారు. ఏ పామో తెలిస్తే సరైన చికిత్స అందిస్తారని వారి ఉద్దేశం. అయితే వ్యక్తికి కాటేసింది ఎలాంటి పామో తెలిస్తే చాలు. వారి లక్షణాలు, పాము కాటేసిన ప్రాంతంలో ఉన్న ఛాయలను బట్టి వైద్యం అందిస్తాం. కొన్నిసార్లు ఏ లక్షణాలు లేకపోయినా 24 గంటల పాటు పరిశీలనలో ఉంచుకుని బాగున్నారంటే ఇంటికి పంపిస్తాం.

– డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్, కర్నూలు

పాముకాటుకు నాటు మందు ప్రమాదకరం



చాలా మంది పాముకాటు వేసిన వెంటనే నాటు మందు వాడుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. పాము కుట్టిన చోట నీలం, ఎరుపు రంగులో మారుతుంది. కట్లపాము, నాగుపాము కాటువేస్తే అది నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి శ్వాస తీసుకోకుండా చేసి వ్యక్తి కోమాలోకి వెళ్తాడు. కళ్లు సరిగ్గా కనిపించవు. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కావడం వల్ల గొంతులో కండరాలు బిగుసుకుపోయి నోట్లో నురగ వస్తుంది. ఫిట్స్ కూడా వస్తాయి. రక్తపింజరి కాటు వేయడం వల్ల రక్తం పల్చగా మారి మూత్రం, చిగుళ్లలో రక్తస్రావం జరుగుతుంది. కాబట్టి పాముకాటు వేయగానే నాటు మందు జోలికి వెళ్లకుండా ప్రథమ చికిత్స చేసి వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలి.

– డాక్టర్ రవికళాధర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చేపట్టిన మెగా డీఎస్సీ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలో 2,645 టీచర్ పోస్టుల భర్తీ కోసం కర్నూలులో 6 పరీక్ష కేంద్రాలు, ఎమ్మిగనూరు, ఆదోని, హైదరాబాద్‌లో 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించిన పరీక్షలు గత నెల 6వ తేదీన మొదలై..బుధవారంతో ముగిశాయి. మొత్తం 56,115 మంది అభ్యర్థులకుగాను 51,510 మంది హాజరుకాగా 4,605 మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో మెగా డీఎస్సీ పరీక్షలు బుధవారం ముగిసినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం పరీక్షకు 695 మందికి గాను 679 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 696 మందికి గాను 684 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

రాఘవేంద్రుల విగ్రహం పేరుతో మోసం

మంత్రాలయం: బెంగళూరు సమీపంలో మైసూరు రహదారి పక్కన 253 అడుగుల రాఘవేంద్రుల విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ప్రచారం చేస్తూ, అలాగే వచ్చిన విరాళాలతో మంత్రాలయం మఠానికి హెలికాప్టర్‌ను సమకూర్చుతున్నట్లు సైబర్ నేరగాడు వసూళ్లకు పాల్పడుతున్నట్లు బుధవారం ఓ భక్తుడు శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సురేష్ పేరు మీద 96119 09961 వాట్సాప్ ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు దారుడు పేర్కొన్నాడు. సైబర్ నేరగాడి మాటలు నమ్మి తాను రూ.1.15 లక్షలు వాట్సాప్ పే చేసినట్లు వివరించాడు. ఆయన ఫిర్యాదు మేరకు మేనేజర్ శ్రీనివాసరావు భక్తులు పలు సూచనలు చేశారు. శ్రీమఠం విరాళాల కోసం ప్రైవేట్ వ్యక్తులకుగానీ, సంస్థలకుగానీ హక్కులు ఇవ్వలేదన్నారు. అంతేగాక విగ్రహ ఏర్పాటుకు శ్రీమఠానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. భక్తులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని సూచించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీల నియామకం



కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లావ్యాప్తంగా బూత్ కమిటీల నాయకులను నియమించింది. వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా కమిటీలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. బూత్ కమిటీ ఉపాధ్యక్షులుగా జియం.క్రాంతికిరణ్ (కర్నూలు), వి.అమర్‌నాథ్ రెడ్డి (పత్తికొండ), ప్రధాన కార్యదర్శులుగా రమేష్ (ఆలూరు), జి.పరుశురాముడు (మంత్రాలయం), తులసీ రెడ్డి (కోడుమూరు), సీ.విశ్వనాథ్ (ఆదోని), యం.శివ (కర్నూలు), కె.రమేష్ (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా మోనీ నారాయణ (ఎమ్మిగనూరు), వి.చంద్రశేఖర్ (పత్తికొండ), రామలింగ (ఆలూరు), కె.నాగరాజు (మంత్రాలయం), ఎస్.మారుతి (ఆదోని), ఎ.మహేష్ (కర్నూలు), విద్యాసాగర్ (కోడుమూరు), ఎస్.గఫూర్ (కర్నూలు), కార్యానిర్వాహక సభ్యులుగా బి.శివభూషణ రెడ్డి (ఎమ్మిగనూరు), ఏ.రవిశేఖర్ రెడ్డి (పత్తికొండ), నందీష్ (ఆలూరు), యు.రమేష్ (మంత్రాలయం), యం.ఎల్లప్ప (ఆదోని), యంసి.నాగరాజు, ఎస్.నజీర్ (కర్నూలు), రమేష్ (కోడుమూరు) నియమితులయ్యారు.

జిల్లా డాక్టర్ల విభాగం కమిటీ

జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ల కమిటీని నియమించారు. ఉపాధ్యక్షులుగా పి.రంగారెడ్డి (పత్తికొండ), జె.ఈరన్న (మంత్రాలయం), ప్రధాన కార్యదర్శులుగా చంద్రశేఖర్ (ఆలూరు), ఎస్.నరహరి రెడ్డి (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా బండ్ల శివరాముడు (ఎమ్మిగనూరు), సి.జయక్రిష్ణ (పత్తికొండ), క్రిష్ణమూర్తి (ఆలూరు), యం.మహబూబ్‌బాషా (మంత్రాలయం), కార్యనిర్వాహక సభ్యులుగా చెన్నప్ప (ఎమ్మిగనూరు), కె.మనోహర్ ఆచారి (పత్తికొండ), ఎస్.మోహన్ రెడ్డి (ఆలూరు), వి.రాగరాజు (మంత్రాలయం)ను పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

‘పోతిరెడ్డిపాడు గేట్లు మేమే ఎత్తేస్తాం’

- స్పష్టం చేసిన ఏపీ రైతు సంఘం నాయకులు
- అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పాములపాడు: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయకపోతే తామే గేట్లను ఎత్తుతామని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక నెమలి వెంకటరెడ్డి సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుతం 875 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. నీటి మట్టం 851 అడుగులు దాటితే పోతిరెడ్డిపాటు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేసి జిల్లాలోని వెలుగోడు, గోరుకల్లు రిజర్వాయర్లు నింపవచ్చన్నారు. అలాగే తెలుగుగంగ, జీఎన్ఎస్ఎస్ కాలువల ద్వారా జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు, చెరువులకు నీటిని సరఫరా చేయవచ్చన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 875 అడుగులకు చేరినా అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. మే నెలలో కురిసిన వర్షాలకు రైతులు విత్తనాలు వేశారని, జూన్‌లో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నీటి విడుదలకు చర్యలు తీసుకోకపోతే ఈ నెల 4న తామే పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు స్వామన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాలయ్య, సీఐటీయూ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

భర్త చేష్టలు భరించలేక గడప దాటిన ఇల్లాలు

- ఇద్దరు పిల్లలతో మంత్రాలయం చేరుకున్న తల్లి
- నాలుగు రోజులుగా శ్రీమఠం ముంగిట యాచిస్తూ పొట్టనింపుకున్న వైనం



తల్లీపిల్లలను రాయచూరు పోలీసులకు అప్పగిస్తున్న ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం: భర్త చేష్టలను భరించలేక ఓ ఇల్లాలు తన పిల్లలతోపాటు ఇంటినుంచి వెళ్లిపోయింది. నాలుగు రోజులపాటు శ్రీమఠం ముంగిట పిల్లలతో గడిపింది. బాధను ఎవరికీ చెప్పుకోలేక కన్నీళ్లు దిగమింగుతూ వెల్లదీసింది. భక్తులను యాచిస్తూ పిల్లలకు ఆకలి దప్పులు తీర్చింది. వివరాలివి.. కర్ణాటకలోని రాయచూరు జిల్లా, కలమల గ్రామం, మారుతి నగర్‌కు చెందిన శివమ్మకు భర్తతో సరిపోక కూతురు వర్షిణి, కుమారుడు నాగరాజతో కలిసి నాలుగు రోజుల క్రితం మంత్రాలయం వచ్చింది. అక్కడ భక్తులను అడుక్కుంటూ పిల్లలను పోషించింది. భార్యాపిల్లలు కనబడకపోవడంతో భర్త బసవరాజు రాయచూరులోని నేతాజీనగర్ పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఐ శివాంజల్‌కు సమాచారం రావడంతో ఫొటోలు తెప్పించుకుని ఊరంతా వెతికారు. కానిస్టేబుల్ రంగస్వామి శ్రీమఠం ప్రాంగణంలో ఆ తల్లీబిడ్డలను గుర్తించి స్థానిక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ సమయంలో ఆమె తన భర్త బసవరాజుతో వెళ్లేందుకు విముఖత వ్యక్తం చేసింది. ఎస్ఐ శివాంజల్ వారిని రాయచూరు పోలీసులకు అప్పగించారు. ఏదేమైనా తల్లీబిడ్డలు సురక్షితంగా దొరకడంతో అటు రాయచూరు పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్‌అండ్‌బీలో పదోన్నతులు

- విజయవాడ ఎస్ఈగా శంకర్‌రెడ్డి
- చిత్తూరు ఎస్ఈగా సురేష్ బాబు

కర్నూలు (అర్బన్): రాష్ట్ర రోడ్డు భవనాల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఆర్‌టీ నెంబర్ 331, 332 తేదీ 2.7.2025ను జారీ చేసింది. కర్నూలు నేషనల్ హైవేస్ ఆర్‌డీసీ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శంకర్‌రెడ్డికి ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ విజయవాడ నేషనల్ హైవే సర్కిల్‌కు బదిలీ చేశారు. అదే విధంగా కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సురేష్ బాబుకు పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు సర్కిల్ ఎస్ఈగా బదిలీ చేశారు. అంతేకాకుండా ఎన్‌హెచ్ కర్నూలు ఎన్‌హెచ్ డీసీ ఆర్‌డీసీ డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ కడప నేషనల్ హైవే డివిజన్‌కు బదిలీ చేశారు. అదే విధంగా అనంతపురం జిల్లాలో డీఈఈగా పనిచేస్తున్న పద్మనాభ రెడ్డిని ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు.

వర్షంలో తడవకుండా షెడ్డులోకి వెళ్లి..

- విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



మృతి చెందిన శేషాద్రి

మహానంది: వర్షానికి తడవకుండా రేకుల షెడ్డు కిందకు వెళ్లిన యువకుడు విద్యుత్ దాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన తమ్మడపల్లెలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కోల శేషాద్రి (19) బంధువుల ఇంటికి వెళ్లాడు. బయటికి రాగా వర్షం పడుతుండటంతో పక్కనే ఉన్న రేకుల షెడ్డు కిందకు వెళ్లాడు. షెడ్డుపైన తీగలు తెగిపడి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. పైపులకు కరెంటు సరఫరా కావడంతో వాటిని పట్టుకుని నిలబడిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధుమిత్రులు శోక సంద్రంలో మునిగారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, గ్రామ నాయకుడు జనార్దన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతుల ప్రాణాల మీదకు తెచ్చిన మద్యం



చికిత్స పొందుతున్న కురువ పెద్ద ఈరన్న

గోనెగండ్ల: భర్త మద్యం అలవాటు ఆ దంపతుల ప్రాణాల మీదకు తెచ్చింది. వివరాలు.. గోనెగండ్లలోని కురువ పేటకు చెందిన పెద్ద ఈరన్న, ఉరుకుందమ్మకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన ఈరన్న డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. బుధవారం రాత్రి ఇదే విషయమై దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. డబ్బులు ఇవ్వకపోతే పురుగు మందు తాగి చస్తానని ఈరన్న బెదిరించాడు. ఆగ్రహానికి లోనైన భార్య ఉరుకుందమ్మ తానే పురుగు మందు తాగి చస్తానని చెబుతూ పొలం కోసం తెచ్చిన పురుగు మందు తాగింది. ఆయోమయానికి లోనైన ఈరన్న డబ్బాలో మిగిలిన పురుగు మందు తాగేశాడు. ఇద్దరు స్పృహ కోల్పోయారు. కాలనీ వాసులు వారిని గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడినుంచి ఎమ్మిగనూరు ఆస్పత్రికి తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సీఐ విజయభాస్కర్ మాట్లాడుతూ.. భార్యభర్తలు పురుగు మందు తాగినట్లు తెలిసిందని, బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే ఆ మేరకు విచారణ చేస్తామని వెల్లడించారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన ఎల్‌ఎల్‌బీ మూడు సంవత్సరాల సెమిస్టర్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. రెగ్యులర్ ఆరో సెమిస్టర్‌లో 204 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 193 మంది పాస్ అయినట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారి డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే ఐదు సంవత్సరాల కోర్సుకు సంబంధించి పదో సెమిస్టర్‌లో ఇద్దరు పరీక్ష రాగా ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేదని వెల్లడించారు.

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో భద్రత పెంచాలి

కర్నూలు(హాస్పిటల్): శిశువు మృతదేహం మాయమైన నేపథ్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో భద్రత మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పీటీ సాయిసుధీర్ కోరారు. ఆసుపత్రిలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ పక్కన ఖాళీ స్థలంలో ఉన్న చెత్తకుప్పలో ఓ గుర్తు తెలియని శిశువు మృతదేహాన్ని మంగళవారం కొందరు గుర్తించారన్నారు. మృతదేహానికి చీమలు పట్టి ఉండటాన్ని గమనించి అధికారులకు సమాచారం ఇచ్చారన్నారు. అయితే ఆ శిశువు మృతదేహం వద్ద ఎలాంటి సెక్యూరిటీ లేకపోవడంతో సిబ్బంది వచ్చేలోగా మృతదేహం మాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలు అనుమానాలు ఉన్నాయని, ఆసుపత్రిలో భద్రతా లోపం కారణంగానే ఈ సంఘటన జరిగిందన్నారు. ఆసుపత్రిలో అదనంగా మరికొన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. జరిగిన ఘటనపై పోలీసులతో విచారణ చేయించాలన్నారు.

నకిలీ మందులు అరికట్టాలి

ప్రజారోగ్యానికి హాని చేసే నకిలీ మందులను అరికట్టాలని ప్రజాపరిరక్షణ సమితి అధ్యక్షుడు కె.బలరాం బుధవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. కొన్ని దుకాణాల్లో నకిలీ మందులతో పాటు కాలపరిమితి తీరిన మందులు సైతం విక్రయిస్తున్నారన్నారు. ఇలాంటి మందులు విక్రయించే వారిపై విజిలెన్స్ అధికారుల చేత దర్యాప్తు చేయించాలని కోరారు.

సుంకేసులకు దిక్కెవరు?

- తుంగభద్ర నదికి వారం రోజుల్లో వరదలొచ్చే అవకాశం
- బ్యారేజీకి ఏడాదికిపైగా ఏఈఈ లేరు
- అదనపు బాధ్యతలతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి
- 12 మంది తాత్కాలిక ఉద్యోగులతోనే సరి
- కేసీ కెనాల్ కర్నూలు సబ్ డివిజన్‌కు ఏడాదిగా డీఈఈ పోస్టు ఖాళీ
- ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోకుండా అడ్డుకుంటున్న ఇంజనీర్



సుంకేసుల బ్యారేజీ

కర్నూలు సిటీ: దక్షిణ భారత దేశంలోనే అత్యంత పురాతనమైనది కర్నూలు–కడప కాలువ (కేసీ కెనాల్). ఈ కాలువకు నీటిని మళ్లించేందుకు తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీ ఎంతో కీలకమైంది. అలాంటి బ్యారేజీ నిర్వహణను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గాలికి వదిలేసింది. దేశంలో అత్యంత నమ్మకంగా నీటి లభ్యత కలిగిన నదుల్లో తుంగభద్ర ఒకటి. ఈ నదికి ఏటా వరదలు వస్తుంటాయి. వరదల సమయంలో సుంకేసుల బ్యారేజీ వద్ద పర్యవేక్షణ చేసేందుకు రెగ్యులర్ సిబ్బంది, ఏఈఈ ఇంజనీర్ లేరు. చాలా ఏళ్లుగా రెగ్యులర్ సిబ్బంది లేక 12 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో పాటు ఏడాదికిపైగా రెగ్యులర్ ఏఈఈని నియమించక పోవడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో తుంగభద్ర నదికి ఇప్పటికే రెండు, మూడు సార్లు వరద నీరొచ్చింది. ఈ బ్యారేజీ నుంచి ఏటా 150 నుంచి 450 టీఎంసీలకుపైగా వరద నీరు ప్రవహిస్తుంది. అంత కీలకమైన చోట రెగ్యులర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెగ్యులర్ డీఈఈ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. దీంతో ఏఈఈ బాధ్యతలు తాత్కాలికంగా మరో ఇంజనీర్‌తో చేయించుకుంటున్నారు. కాలువకు నీరు వదిలితే సదరు ఇంజనీర్ తన రెగ్యులర్ విధులతో పాటు, అదనపు బాధ్యతలు నిర్వహించడం భారంగానే ఉంటుంది. రెగ్యులర్ ఏఈఈ లేకపోవడంతో బ్యారేజీపై పర్యవేక్షణ కరువై.. నిర్వహణ పనులను సైతం సక్రమంగా చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

రెగ్యులర్ డీఈఈ నియామకాన్ని అడ్డుకుంటున్నదెవరు?

కర్నూలు–కడప కాలువ కర్నూలు సబ్ డివిజన్‌లో డీఈఈగా పనిచేస్తున్న రఘు రామిరెడ్డి గతేడాది నాణ్యత నియంత్రణ విభాగానికి బదిలీ అయ్యారు. ఆ తరువాత హంద్రీనీవా సుజల స్రవంతి డివిజన్–3లో డీఈఈగా పనిచేస్తున్న ప్రసాద్‌రావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ విధులతో పాటు, అదనపు బాధ్యతలను ఏడాది పాటు నిర్వహించారు. అయితే ఈ ఏడాది మార్చి తరువాత హంద్రీ – నీవా విస్తరణ పనులు మొదలు కావడంతో అదనపు బాధ్యతల నిర్వహణ కష్టంగా మారింది. ఇటీవల జరిగిన బదిలీల్లో ప్రసాద్‌రావు హంద్రీ – నీవా సర్కిల్–2 పరిధిలోని అనంతపురం బత్తులపల్లికి బదిలీ అయ్యారు. అదనపు బాధ్యతలు చూసే డీఈఈ బదిలీ అయినా ఇంతవరకు రెగ్యులర్ డీఈఈని నియమించలేదు. తుంగభద్ర నదికి వరదలు వస్తున్న సమయంలో బ్యారేజీకి ఏఈఈ, డీఈఈలు, ఇద్దరు రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో నిర్వహణ పర్యవేక్షణపై ఆందోళన నెలకొంది. వాస్తవానికి కేసీ కర్నూలు సబ్ డివిజన్‌కి రెగ్యులర్ డీఈఈని నియమించకుండా ఏడాదిగా ఓ ఇంజనీర్ సామ్ములిచ్చి కూటమి నేతల ద్వారా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్న డీఈఈ సైతం పక్క జిల్లాకు బదిలీ అయినా తన బాధ్యతలు కొనసాగేలా ఓ మంత్రి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు జల వనరుల శాఖలో చర్చ జరుగుతుంది. ఈ విషయంపై జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ బాలచంద్రారెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.